క్లుప్తంగా

ధనలక్ష్మిగా నవదుర్గ



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం నవదుర్గా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. దుర్గమ్మ తల్లిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు, కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ ఆవరణలో కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. శ్రావణ మాసం సందర్భంగా గురు, శుక్రవారాల్లో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ గిన్ని శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి కుంకుమార్చన, వ్రత పూజలు, అన్నదానం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సాయిబాబాకు పూజలు



మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పలు సుగంధ మాలలు, ఆభరణలు, పట్టు వస్త్రాలతో బాబాను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు మహిళలు మందిరం వద్ద భజనలు చేసి బాబా కీర్తనలు ఆలపించారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించి, బాబా పాదాలను పురవీధుల్లో ఊరేగించారు.

పాఠశాలల్లో రక్షా బంధన్ వేడుకలు



స్కూల్ ప్రిన్సిపాల్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ సింధు

మల్కాపురం: రక్షా బంధన్ అంటే అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తామని అన్నదమ్ములు ఇచ్చే ఒక భరోసా అని సరస్వతీ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం బ్రాంచ్) ఆధ్వర్యంలో గురువారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు రాఖీలు కట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీహరిపురంలో బ్రహ్మకుమారీ సంస్థ నిర్వాహకురాలు సింధు ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో గణబాబు

మల్కాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పలువురు లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. 63వ వార్డు చింతలలోవలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు పలువురికి చెక్కులు అందజేసి మాట్లాడారు. జీవీఎంసీ 60, 62, 63 వార్డుల ప్రాంతాలకు చెందిన పలువురు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ సాయం కోరారన్నారు. వారి అర్హతను బట్టి సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేశారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్నా, గుడేల కృష్ణ, గేదల రమణ, మజ్జి మాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సాయపడాలి



విజ్ఞాన యాత్రలో పాల్గొన్న విద్యార్థులతో పోలీస్ అధికారులు

మల్కాపురం: ప్రతి విద్యార్థి ధైర్య సాహసాలు కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని గాజువాక సీఐ పార్థసారధి అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ స్కూల్ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా గురువారం గాజువాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారితో సీఐ ముచ్చటించారు. నేరం జరిగినప్పుడు పోలీసులు ఎలా స్పందిస్తారు, ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తారు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ పాత్ర వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ఎవరికైనా ఏదైనా కష్టమొస్తే సాయపడాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ అధికారులు, లక్కీ అమర్ స్కూల్ ప్రిన్సిపాల వాసుదేవ రావు పాల్గొన్నారు.

షరా మామూలే..!

- ఇళ్ల నుంచి తీసుకున్న విద్యుత్‌తో కుళాయి కనక్షన్ల పనులు
- మారని ఎన్‌సీసీ కాంట్రాక్టర్ల తీరు
- పట్టించుకోని అధికారులపై ఇందిరానగర్‌వాసుల మండిపాటు



జనరేటర్ ఉంచిన ఆటో



డ్రిల్లింగ్‌కు ఇంటి నుంచి తీసుకున్న విద్యుత్ (ఇన్‌సెట్) ఇందిరానగర్‌లో తాగునీటి కుళాయి కనెక్షన్ కోసం రోడ్డును డ్రిల్‌చేస్తున్న కార్మికుడు

గోపాలపట్నం: నాగార్జునా కనస్ట్రక్షన్ కంపెనీ పేరు గాంచినదే అయినా.. వారి బుద్ధి మాత్రం కుచించుకుపోయింది. జనరేటర్ విద్యుత్‌తో నిరంతర వ్యక్తిగత తాగునీటి కుళాయి కనక్షన్ ఇచ్చేందుకు జరుగుతున్న పనుల కోసం ప్రజల మీద ఆధార పడుతున్నారు. ఇదేంటని అడిగిన వారి ఇంటి నుంచి విద్యుత్ కనక్షన్ తీసి జనరేటర్‌కు పెడుతున్నారు. జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో నిరంతర మంచినీటి ఇంటింటి కుళాయి కనక్షన్ల పనులు జరుగుతున్నాయి. వీటికి విద్యుత్ సదుపాయాన్ని కాంట్రాక్టరే ఏర్పాటు చేసుకోవాలి.. అలా చేయకుండా మీకు కుళాయి కనక్షన్ కావాలంటే విద్యుత్ సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కరెంటు ఇవ్వకపోతే కనక్షన్ లేదని తెగేసి చెబుతున్నారు. గతంలో కూడా గోపాలపట్నం నరసింహనగర్‌లో ఇదే మాదిరిగా వ్యవహరించారు. దీనిపై గతంలో 'కరెంట్ ఇస్తేనే కుళాయి' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం కూడా ప్రచురించారు. అయినా వారి తీరు మారలేదు. షరా మామూలు గానే స్థానికుల ఇళ్ల నుంచి విద్యుత్ కనక్షన్ తీసుకుని రోడ్డు డ్రిల్లింగ్ మొదలైన పనులు నిర్వహిస్తున్నారు. కరెంట్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే.. పక్కనే ఆటోలో పెట్టుకున్న జనరేటర్ ద్వారా విద్యుత్ కనక్షన్ ఇచ్చి పనులు జరిపిస్తున్నారు. మరో చోటకు వెళ్తే అక్కడ కూడా స్థానికుల విద్యుత్ కనక్షన్‌తో తమ పనులు చేసుకుంటూ పోతున్నారు.

కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేందుకే..

జీవీఎంసీ 24/7 వాటర్ సప్లై అధికారులు తీరు కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేలా ఉందని పలువురు ఇందిరానగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ పనులకు డీజిల్ ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని, దీన్ని తగ్గించుకునేందుకు ఈ ఎత్తుగడ వేస్తున్నారని చెబుతున్నారు. అధికారులకు వాటా ఉంటుందని, అందుకే వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏఈ స్థాయి అధికారుల అండదండలతో ఈ దందా సాగుతోందంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజలపై పడి విద్యుత్ దోపిడీ చేస్తున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీఆర్ఎం దృష్టికి రైల్వే సమస్యలు



డీఆర్ఎం లలిత్ బోహ్రాకు సమస్యలు వివరిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) లలిత్ బోహ్రాను ఆయన కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్ గణబాబు కలిశారు. పశ్చిమ నియోజకవర్గంలో రైల్వేకు అనుసంధానమైన పలు సమస్యలపై డీఆర్ఎంతో చర్చించారు. సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధిలో స్థానికుల యాక్సెస్‌బిలిటీ మెరుగు పరచాలని కోరారు. అదనపు ప్రవేశ ద్వారాల బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్టేషన్ వెనుక భాగంలో పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. బాజి జంక్షన్ నుంచి ఎస్సీ కాలనీ మీదుగా శ్మశాన వాటిక వెనుక రోడ్డు నార్త్ సింహాచలం వరకు రహదారిని విస్తరించాలన్నారు. చాకలి గెడ్డ అండర్ పాస్ వంతెన గాని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ గాని నిర్మించాలని కోరారు. దీని వల్ల దయానగర్, చాకలి గెడ్డ ముత్యమాంబ కాలనీల వాసులకు ఉపయోగపడుతుందని వివరించారు. శ్యామ్‌నగర్ కాలనీ వాసుల సౌకర్యం కోసం నేవల్ క్వార్టర్ కాంపౌండ్ వాల్‌కు ఆనుకుని రహదారి నిర్మించేందుకు, వెంకటాపురం అండర్‌పాస్‌వే వద్ద సీసీ రోడ్డు వేసేందుకు అనుమతివ్వాలని కోరారు. వీఎంఆర్‌డీఏ వైజాగ్ మాస్టార్ ప్లాన్‌లో భాగంగా ఎన్‌హెచ్-16 కారిడార్ అనుసరించి బాజి జంక్షన్ నుంచి కాకానినగర్ మీదుగా విమానాశ్రయానికి 15 నుంచి 20 మీటర్ల వెడల్పు గల రహదారి నిర్మించేందుకు స్థలం పరిశీలించాలన్నారు. ఈ అంశాలను పరిశీలించి అభివృద్ధికి దోహద పడాలని కోరారు. వీటిపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించారని గణబాబు తెలిపారు.

అదృశ్యమైన భార్య, పిల్లల అప్పగింత

మల్కాపురం: భర్త తన మాట వినలేదనే కోపంతో ఇంటి నుంచి ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిన వివాహితను 20 గంటల వ్యవధిలో పోలీసులు గుర్తించి, భర్తకు అప్పగించారు. వివరాలిలా.. కోరమాండల్ సమీప ప్రాంతంలో నివసిస్తున్న జాన్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ జాబ్ నిమిత్తం హైదారబాద్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ విషయాన్ని తన భార్య దేవికి తెలియజేశాడు. రెండు నెలల్లో తిరిగి వస్తానని, జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. తమను కూడా వెంట తీసుకెళ్లమని దేవి తన భర్తను కోరడంతో అతడు నిరాకరించాడు. జాన్ హైదరాబాద్ బయలుదేరిన మరుక్షణమే దేవి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈ నెల 5వ తేదీ మంగళవారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి విజయవాడ చేరుకుంది. కోపంతో వెళ్లిన ఆమె అక్కడ ఏం చేయాలో తెలియక మరుసటి రోజు తన సొంత ఊరు గజపతినగరం బయలుదేరి వెళ్లింది. హైదరాబాద్ వెళ్లిన భర్త తన భార్య క్షేమ సమాచారం కోసం ఫోన్ చేయగా.. ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి కూడా చేరుకోలేదని తెలుసుకున్నాడు. జాన్ హడావిడిగా బుధవారం ఉదయం వైజాగ్ వచ్చి మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ గొలగాని అప్పారావు విచారణ చేపట్టగా.. దేవి, తన ఇద్దరు పిల్లలతో గజపతినగరంలో ఉందని తెలుసుకున్నారు. ఆమెను అక్కడి నుంచి తీసుకొచ్చి గురువారం భర్త జాన్‌కు అప్పగించారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు..



డాక్‌యార్డ్ గొడౌన్స్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: ప్రజల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దే వద్దని సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం డాక్‌యార్డ్ సమీపాన గొడౌన్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను మరిన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు



గోపాలపట్నం మెడికల్ షాప్‌లో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

గోపాలపట్నం: గోపాలపట్నం, నాయుడుతోట, వేపగుంట, ఎస్‌ఏడీ పరిసర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో గురువారం ప్రత్యేక బృందాలు ఏక కాలంలో తనిఖీలు నిర్వహించాయి. మందుల చీటీలు లేకుండా ఇవ్వకూడని మందులు విక్రయించడం, నార్కోటిక్ మందులు, నిద్ర మాత్రలు, అబార్షన్ మందులు అమ్మకాల తీరును పరిశీలించారు. జిల్లాలోని ఐదుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల్లో పాల్గొన్నారని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ తనిఖీల్లో ఫార్మాసిస్టులు లేకపోవడం, బిల్లులు మెయింటైన్ చేయకపోవడం వంటివి గమనించామన్నారు. వీటిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా' పోటీలు



రంగోలి పోటీల వద్ద ఈకార్వో ప్రెసిడెంట్, సభ్యులు

తాటిచెట్లపాలెం: హర్ ఘర్ తిరంగా-2025 కార్యక్రమంలో భాగంగా వాల్తేర్ డివిజన్ పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆధ్వర్యంలో దేశభక్తిని పెంపొందించే విధంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాలకు రంగోలి, వ్యాసరచన, క్విజ్ పోటీలు, తిరంగా స్ఫూర్తితో నిండిన సైకిల్, బైక్ ర్యాలీలు, తిరంగా ఆర్ట్ పెయింటింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం రైల్ క్లబ్‌లో రంగోలి, వ్యాచరచన పోటీలు జరిగాయి. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా, ఇతర సభ్యులు, రైల్వే ఉద్యోగులు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి అజయ్, విద్యార్థులు

మల్కాపురం: దేశం గర్వించదగ్గ మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని మల్కాపురం శాఖ గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అన్నారు. గ్రంథాలయంలో గురువారం ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఠాగూర్ రచనలు మానవత్వానికి, ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి చెందినవన్నారు. నోబుల్ శాంతి బహుమతిని పొందడం ద్వారా ఠాగూర్ దేశఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలరావు, అధ్యాపకులు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల వితరణ



కిట్లు అందిస్తున్న కోరమాండల్ సంస్థ అధికారులు, స్థానిక నాయకులు

మల్కాపురం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 58వ వార్డు కోడిపందాలదిబ్బ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సీఎస్సార్ హెడ్ వెంకటరమణ, స్థానిక నాయకులు కోరాడ శ్రీనివాస్, పాతబత్తుల శ్రీను తదితరులు కిట్లు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు 90 మంది గర్భిణులకు కిట్లు అందించినట్లు తెలిపారు. గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలనే సంకల్పంతో కోరమాండల్ సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి పౌష్టికాహారం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొందేశి రాజేష్‌రెడ్డి, వాతాడ సుజాత, డాక్టర్ ఉదయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చురుగ్గా వేంకటేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలో 93 ఏళ్ల చరిత్ర గల వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ శ్లాబ్ నిర్మాణానికి గురువారం మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొరుసు మహేశ్వరరెడ్డి, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు గొరుసు తనూజ దంపతులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆలయ శ్లాబ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మహేశ్వరరెడ్డి, వాసుదేవరావు

తల్లిపాలే బిడ్డకు దివ్య ఔషధం



పోషకాహార కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ రమణ, డాక్టర్ రేవతి, సూపర్‌వైజర్ జ్యోతి

విశాఖ విద్య: పుట్టిన వెంటనే నవజాత శిశువుకు ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, అనారోగ్య సమస్యలు దరిచేరవని బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.రేవతి అన్నారు. అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సింహాచలం, మర్రిపాలెం సెక్టార్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 90వ వార్డు బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.టి.ఎస్.జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిశువుకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా మెదడు చురుకుగా పనిచేయడంతోపాటు జ్ఞాపక శక్తి ఇనుమడిస్తుందన్నారు. ఆరు నెలల పాటు శిశువుకు రోజుకు 12 సార్లు పాలు తాగించాలని సూచించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సింహాచలం, మర్రిపాలెం, మల్కాపురం సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



గౌరీపరమేశ్వరుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో శ్రీ గౌరీపరమేశ్వరుల స్ఫటిక శివలింగాలయం ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో కొలువుదీరనున్న గౌరీపరమేశ్వరుల స్ఫటిక శివలింగాలయం తమ ఇళ్ల ముందుకు రావడంతో స్వామి ఆశీస్సుల కోసమని భక్తులు మొక్కులు సమర్పించుకొని పూజలు చేశారు.

కళకళలాడిన మార్కెట్లు



గోపాలపట్నం జ్యూయలరీ షాపులో కొనుగోలుదారుల తాకిడి



గోపాలపట్నం ప్రధాన రహదారిలోని వస్త్ర దుకాణాల వద్ద జనం రద్దీ (ఇన్‌సెట్) పూజా సామగ్రి కొంటున్న ప్రజలు

గోపాలపట్నం: శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం మహిళలంతా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ సందర్భంగా గోపాలపట్నం రైతుబజారు, మార్కెట్లు, గోపాలపట్నం, సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డులో పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. ఇక్కడి ప్రధాన రహదారులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గోపాలపట్నంలోని జ్యూయలరీ షాపులు వరలక్ష్మీ వ్రతం కోసం బంగారు కాసు, వస్తువులు కొనేందుకు అధిక సంఖ్యలో వచ్చిన మహిళలతో రద్దీగా కనిపించాయి. పూజా సామగ్రి, పువ్వులు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. 250 గ్రాముల పువ్వులు రూ.150 ధర పలికాయి. పూలు, పండ్ల ధరలు అమాంతంగా పెరగడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. పూజకు సరిపడా సామగ్రి మాత్రమే కొనుగోలు చేశారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.